
తవ్వా ఓబుల్ రెడ్డి

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి జీవితం–సాహిత్యం

2020

నెల నెలా మన జిల్లా సాహిత్యం

(కడప జిల్లా సాహిత్యంపై చేసిన ప్రసంగ వ్యాసాలు)



ప్రచురణ

సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం

యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.



కుప్పిరెడ్డి పద్మనాభ రెడ్డి జీవితం - సాహిత్యం

- శ్రీ తవ్వా ఓబుల్ రెడ్డి

ప్రముఖ కథారచయిత శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారు కడప జిల్లా పెద్దముడియం మండలం జీరెడ్డి కొత్తపల్లె గ్రామంలో 1940 డిసెంబర్ 14వ తేదీన జన్మించారు. తల్లి వెంకటమ్మ, తండ్రి కుప్పిరెడ్డి వెంకటరెడ్డి గారు. పద్మనాభరెడ్డి గారి తండ్రి వెంకటరెడ్డి గారు అభ్యుదయ భావాలు కలిగినవారు. ఆయన ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి సంపాదకత్వంలో వెలువడుతూ ఉండిన 'స్వరాజ్య' పత్రికకు విలేకరిగా పనిచేస్తూ ఉండేవారు.

శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డిగారు ప్రాథమిక విద్యను స్వగ్రామంలో అభ్యసించారు. ఉన్నత పాఠశాల విద్యను (1960-67) జమ్మలమడుగులో ప్రతిష్ఠాత్మక పతంగి రామారావు బోర్డు పాఠశాలలో ఇంటరు వరకు చదివారు. డిగ్రీ, బి.ఇడి చదువులను పూర్తి చేశారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1967 నుండి 1969 వరకు ఎం.ఏ. (ఇంగ్లీషు) చదివారు. "The Progressive Out Look in the Novels of Howard Fast" అనే అంశంపై చేయతలపెట్టిన పరిశోధన కొన్ని కారణాలవల్ల పూర్తి చేయలేకపోయారు.

చదువుపూర్తి అయిన వెంటనే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో 'లెక్చరర్'గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. 1969-70 సంవత్సరాలలో అక్కడ పనిచేసి, 1970లో కడపలోని ఆర్ట్స్ కళాశాలకు బదిలీపై వచ్చారు. 1979 నుండి 1987 వరకు ప్రొద్దుటూరులోని ఎస్‌సిఎన్ఆర్ ఆర్ట్స్ కాలేజీలో పనిచేశారు. 1987 నుండి 1989 వరకు తాడిపత్రిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు. 1990-92 వరకు మళ్ళీ కడప ఆర్ట్స్ కాలేజీలో పనిచేశారు. తరువాత 1993-98 వరకు మళ్ళీ ప్రొద్దుటూరు ఎస్‌సిఎన్ఆర్ ఆర్ట్స్ కళాశాలలో పనిచేసి 1998లో పదవీ

విరమణ చేశారు. ఆ తర్వాత ప్రొద్దుటూరులో స్థిరపడి విశ్రాంత జీవితాన్ని గడపుతున్నారు. శ్రీ పద్మనాభరెడ్డి గారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారులు ముగ్గురూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

జమ్మలమడుగులోని పతంగి రామారావు హైస్కూలులో చదువుకుంటు న్నప్పుడు శ్రీ కాండూరు నరసింహాచార్యులు, శ్రీ నారాయప్పరెడ్డి తెలుగు పాఠ్యాంశాలను బోధించేవారు. పురాణాలు, సాహిత్యం పట్ల పద్మనాభరెడ్డి గారు కనబరుస్తున్న ఆసక్తిని గమనించిన శ్రీకాండూరు నరసింహాచార్యులు, శ్రీ నారాయప్పరెడ్డి గారలు ఛందస్సులో పట్టును కలిగించి పద్యరచనలో మెళకువలను నేర్పించారు. పద్యాలను రాయమని బాగా ప్రోత్సహించారు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని' కావ్య ప్రభావంతో కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారు "సెలయేటి నాదాలు" అనే లఘుకావ్యాన్ని మాత్రాఛందస్సులో రచించారు. దీనిని భారతిలో ప్రచురణకు కూడా పంపానని పద్మనాభరెడ్డి చెప్పారు.

'సెలయేటి నాదాలు' అనే కావ్యాన్ని తన స్వగ్రామం జీరెడ్డి కొత్తపల్లె మీదుగా వెళ్ళి, కుందూనదిలో కలిసే వాగుపై వ్రాశాడు శ్రీ పద్మనాభరెడ్డి.

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి రచనలు

శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి దాదాపు 20 కథలను రచించారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలలో ఆయన కథలు ప్రచురించబడ్డాయి. కడప ఆకాశవాణి కేంద్రం ద్వారా కూడా ఆయన కథలు ప్రసారం అయ్యాయి. యుగసాహితి సంస్థ ప్రచురించిన 'కుట్ర' కథల సంపుటి 10 కథలతో 1982లో వెలువడింది. పద్మనాభరెడ్డి గారికి బాలసాహిత్య సృజనలో కూడా ప్రవేశం ఉండటం విశేషం! ఈయన రచించిన 10 బాలల కథలు 'బాల', 'బాలభారతి' లాంటి బాలల పత్రికలలో ప్రచురించబడ్డాయి.

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి అనువాద కృషి

ప్రముఖ అమెరికన్ రచయిత ఐజాక్ బస్వింగర్ రచించిన కథలను ప్రతినెలా వెలువడే 'విపుల' పత్రికలో అనువాదం కూడా చేశారు. ప్రముఖ కవి వేగుంట మోహన్ ప్రసాద్ (మో) సంపాదకత్వంలో వెలువడిన "తెలుగు పోయెట్రి ఫర్ ఇంటర్నేషనల్ రీడర్స్" సంకలనంలో పద్మనాభ రెడ్డిగారు గజ్జెలమల్లారెడ్డి కవితలను అనువాదం చేశారు. ఈ కవితల్లో "తెలుగునాట భక్తిరసం" అనే కవిత కూడా ఉంది.

సాహిత్య సంస్థలతో సంబంధాలు

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారికి అభ్యుదయ రచయితల సంఘంతో దాదాపు రెండు దశాబ్దాల కాలంపాటు సంబంధాలు ఉండేవి. అరసం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరించిన పద్మనాభరెడ్డిగారు అరసం జిల్లాకార్యదర్శిగా రెండు, మూడుసార్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మహాసభలను కడపలో నిర్వహించడంలో కృషి చేశారు. సోషలిస్ట్ స్టడీ సర్కిల్ కడప జిల్లా కార్యదర్శిగా కూడా ఆయన వ్యవహరించారు. బ్రిటీష్ కౌన్సిల్ లైబ్రరీ, అమెరికన్ స్టడీ సెంటర్‌లలో ఆయనకు జీవిత సభ్యత్వం కూడా ఉంది. యుగసాహితీ సంస్థతో ఆయనకు ఉన్న సంబంధాల గురించి ఇంతకు ముందే ప్రస్తావించడం జరిగింది.

రా.రా. సాహిత్య సంపుటాల ప్రచురణ కృషి

ప్రఖ్యాత విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) సాహిత్యాన్ని గుదిగుచ్చి సమగ్ర సాహిత్య సంపుటాలను తీసుకువచ్చేందుకు శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి కృషి చేశారు. ఇప్పటివరకు రారా కథలు, వ్యక్తి స్వాతంత్ర్యం – సమాజ శ్రేయస్సు, అనువాద సమస్యలు – సంపుటాల రూపంలో తీసుకువచ్చారు. రారా లేఖల సంపుటిని కూడా ప్రచురించనున్నారు. రారా సమగ్ర సాహిత్యాన్ని మొత్తం నాలుగు సంపుటాలుగా వెలువరించనున్నట్లు ఆయన తెలిపారు. శ్రీశ్రీ, కొడవటిగంటి తర్వాత తెలుగు సాహిత్యానికి సమగ్రమైన దృక్పథాన్ని రారా కల్పించారని కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

మార్క్సిజమ్‌తోనే సమాజం సుభిక్షంగా ఉంటుంది

కేవలం పిడివాదం ఆధారంగా కాకుండా శాస్త్రీయ దృక్పథం ప్రాతిపదికగా మార్క్సిజం సిద్ధాంతం ఆవిర్భవించిందని శ్రీ పద్మనాభరెడ్డి గారు బలంగా విశ్వసిస్తారు. పెట్టుబడి దారీ, భూస్వామ్య విధానాలకంటే మార్క్సిజం వయస్సులో చిన్నదని, మార్క్సిజం మాత్రమే క్రమానుగత పరిణామ సిద్ధాంతానికి అనుగుణంగా నడచు కుంటుందని ఆయన అభిప్రాయపడతారు.

ఫ్యూడలిజమ్, క్యాపిటలిజమ్, రివిజనిజమ్, నయారివిజనిజమ్ సిద్ధాంతాలు విజయవంతం కాలేకపోయాయని అన్నారు. రివిజనిస్టులకుట్ర, సోవియట్లు పాల్పడిన స్వయంకృతాపరాధాల కారణంగానే సోవియట్ యూనియన్ పతనమైందని కుప్పిరెడ్డి

పద్మనాభరెడ్డి భావిస్తున్నారు. అయినప్పటికీ మార్క్సిజమ్ మాత్రమే ప్రపంచానికి శాంతిని తీసుకు రాగలదని, మిగిలిన రాజకీయ సిద్ధాంతాలు ఆపని చేయలేవని ఆయన నమ్ముతున్నారు. సాహిత్యం విషయానికి వస్తే అభ్యుదయ భావాలున్న సాహిత్యం సముచితంగానే వస్తోందని, ప్రజల్లో చైతన్యం కలిగినప్పుడు, ప్రజా ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలోనే సాహిత్యం కూడా చైతన్యశీలతను సంతరించుకుంటుందనేదే శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారి అభిప్రాయం.

శ్రీ కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారి కథలు - వస్తువు - శిల్పం

పద్మనాభరెడ్డి గారు చాలా కథలు రచించారు. వీటిల్లోని 10 కథలతో 1982వ సంవత్సరంలో యుగసాహితీ ప్రచురణగా 'కుట్ర' కథల సంపుటి వెలువడింది. ఈ కథా సంపుటి 160 పేజీలతో డెమ్మీసైజులో ప్రముఖ చిత్రకారుడు చంద్ర వేసిన ముఖచిత్రంలో అందంగా వెలువడింది. ఈ కథలపై రారా అభిప్రాయం సంపుటి చివరి పేజీల్లో ప్రచురితం అయింది. 1982లో ఈ పుస్తకం ధర 15 రూపాయులు. ప్రొద్దుటూరులోని గాయత్రీ ప్రింటర్స్‌లో ఈ పుస్తకం ముద్రితమైంది. ఇప్పుడు ఈ కథా సంపుటి మార్కెట్‌లో లభించదు.

ఈ సంపుటిలో 1) పసిహృదయం, 2) అతడు చూసిన రాధ, 3) అంతర్వేదన, 4) పెట్టుబడి – గట్టుబాటు, 5) శిక్షపడిన సిన్సియారిటీ, 6) మాయ, 7) ఓబిగాడు, 8) కుట్ర, 9) నేతిబీరకాయ, 10) మేధావి అనే కథలు ఉన్నాయి. ఈ కథల్లో కొన్ని ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతులలో ప్రచురితం కాగా అన్ని కథలూ కడప ఆకాశవాణి ద్వారా ప్రసారం అయ్యాయి. ఈ కథలన్నీ 1970వ దశకంలో రాసిన కథలుగా కథావస్తువు ఆధారంగా కథల్లో చొప్పించిన కొన్ని సంఘటనల ఆధారంగా చెప్పవచ్చు.

హాస్యం, వ్యంగ్యం, విషాదం కలగలిసిన వాతావరణంలో సాగే ఈ కథల్లో చాలా వాటికి నిగూఢత (సస్పెన్స్) ప్రత్యేక లక్షణంగా నిలుస్తుంది. ఈ సంపుటిలోని ఒక కథ పేరుతోనే కథా సంపుటి వెలువడటం చూస్తే (టైటిల్ స్టోరీ) సంపుటి శీర్షిక కథ 'కుట్ర'కు ఉన్న ప్రాధాన్యత విస్మరించరానిది.

అయితే ఈ సంకలనంలోని 'ఓబిగాడు' కథ మాత్రం విమర్శకుల, పాఠకుల, సహరచయితల ఆదరాభిమానాలను చూరగొన్నది. ఆ కథను స్వల్ప వ్యవధిలో చదివి వినిపించిన తర్వాత కథా వస్తువు, శిల్పంపై పరామర్శ చేసే ప్రయత్నం చేస్తాను.

ఓబిగాడు - కథ

రెండు మూడు దశాబ్దాల కిందటి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, సంపన్న రైతుకుటుంబాల్లో ఉండిన జీతగాళ్ళ వ్యవస్థను, ఆ వ్యవస్థలో సాగిన దాష్టీకాలకు "వోబిగాడు" కథ ప్రతీకగా నిలుస్తుంది. గ్రామీణ రైతుకుటుంబాల్లో రెండు మూడు దశాబ్దాల కిందటి వరకూ అంటే ట్రాక్టర్లు, ఇతర మరయంత్రాలు రానంతవరకు ఒక్కో ఎగువ మధ్యతరగతి రైతు ఇంట్లో నాలుగైదు కాండ్లు ఎద్దులు ఉండేవి. పాడి ఎనుములు, ఆవులు లాంటి పశుసంపద కూడా ఉండేది. వీటిని చూసుకోవడానికి జీతగాళ్ళు ఉండేవారు. రైతుల ఇళ్లల్లో జీతగాళ్ళుగా దళితులు, బడుగు వర్గాల వారు ఉండేవారు. వారికి సంవత్సరానికి ఇంత అని జీతం చెల్లించేవారు. ఒకటిరెండు జతల కొత్త బట్టలతోపాటు తమ పిల్లలు తొడుక్కుని పాతబడి పైకి ఎగబాకిపోయిన పాతబట్టలు ఇచ్చేవారు. చద్దన్నం, సంగటి ఆహారంగా పెట్టేవారు. ప్రత్యేక సందర్భాల్లో తప్ప రాయలసీమలోని గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు కూడా చాలామందికి చద్దన్నం, సంగటే ఆహారం! కూడు, గుడ్డ విషయం అలా ఉంటే జీతగాళ్ళ చాకిరీకి మాత్రం 'వోబిగాడు' కథ దర్పణం పడుతుంది. దాష్టీకాలు, దొంగతనం ఆరోపణలను ఎదుర్కోవడం నిత్య వ్యవహారంగా సాగుతూ ఉండేది.

జీతానికి పడి ఉండే ఒక పిల్లగాడి దగ్గర ఐదురూపాయలుంటే, ఖచ్చితంగా ఆనోటు దొంగతనం చేయడం వల్ల వచ్చినదే అనే అభిప్రాయానికి వచ్చే మనుషుల మనస్తత్వాన్ని ఈ కథలో పద్మనాభరెడ్డి చూపెట్టారు.

పిల్లి పిల్లనైనా సరే మూలన ఇరికించుకుని కొడితే అది ఎదురు తిరిగి గోళ్ళతో బరుకుతుందని ఓబిగాడు పాత్ర ద్వారా రచయిత చాటారు. పనిలో పనిగా పోలీసుల వైఖరిపై, చిత్తవృత్తిపై కూడా రచయిత వ్యంగ్యంగా అక్షింతలు వేశారు.

ఈ కథను తనకు అత్యంత ఇష్టమైన కథగా ప్రఖ్యాత కవి వేగుంట మోహన ప్రసాద్ 'విస్' పేర్కొంటూ 'స్వాతి' పత్రికలో పరిచయం చేశారు. జూన్-2013 సంచిక స్వాతి మాసపత్రికలో 'మో' పరిచయంతో మళ్ళీ పునర్ముద్రితం కావడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ఈ కథను గురించి 'మో' అభిప్రాయం ఇలా ఉంది.

"మన తప్పులకు ఇతరుల్ని బాధ్యుల్ని చేస్తాం. మామూలుగా మనకు బాగా తెలిసిన సత్యాన్ని చెప్పడానికి ధైర్యం ఉండదు. తెలీని నిజాన్ని తెలుసుకునే ధైర్యమూ ఉండదు. ఎంత సేపూ Half Truths, Flatitudes లో ఇంటలెక్చువాలిటీలో దాక్కుంటాం! బెల్చీ, చిన ఓగిరాల (కారంచేడు, తరహా) సంఘటనల్ని ఇంగ్లీషు దినపత్రికల్లో చదివి ఆ రిపోర్టర్ల ఆంగ్లశైలిని మెచ్చుకుంటాం!

మన కోసం, మన పనుల్ని చేసిపెట్టేవాళ్ళని వీలైనంత కాలరాస్తాం! మనకో నిజం, మనం కానివాళ్ళకో నిజమూ, న్యాయమూ, ధర్మమూ ప్రత్యేకంగా అరల్లో సొరగుల్లో భద్రపరుస్తాం. రాజకీయ నాయకుల ధోరణి ఇదే!

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి గారి కథలోని గొప్పతనం – 'కథలో తన శ్రమ విలువ తెలిసిన అత్తగారూ' 'అత్తగారి ఔదార్యంతో దీర్ఘకాలిక బాధలకు గురైన తనూ' 'సడేలే సంబడం' అని తెయ్ మని ఒంటికాలు మీద లేచే పెళ్ళాం, ఓబిగాడి "గజ్జికుక్క లాంటి నాన్న" ఆస్తికోసం రాముని ఎప్పుడైనా బలిచేయగలిగిన అత్తగారి అన్న, తన అన్న పెళ్ళాం శ్రుతి, అత్త పల్లవి –

పశువుల అవసరాలూ, మనుషుల అరపుల్నుంచీ తప్పించుకోలేక పదేళ్ళ ప్రాయానికే ఓబిగాడి అభిమానాన్ని కరిచేసిన రామూ–"

ఈ పాత్రల ద్వారా (రచయిత) తన మీద తనే ఓ క్రూయల్ జోక్ వేసుకోగల ధార్మిక కోపం – ఈ వ్యవస్థ మీద ఆగ్రహం గొప్పవి. ఇలాంటి కథలు రాయడం ఎంత కష్టమో... చదవడమూ అంతే కష్టం. ప్రచురించడం మరీ కష్టం. పెర్రీ మేసన్నూ, షెర్లాక్ హోమ్స్ రోజూ ఫలహారం చేసే యువకులు చదువలేరు. ధర్మాన్ని కాపాడే పాడుబుద్ధి ఉన్న తండ్రులు, మన హాయి కోసం నశించాలి గాక నశించాలి.

బలమైన సెటైర్‌తో గెరిల్లా పోటు పొడిచే ఇలాంటి కథకుల కలాలు విరిగిపోవాలి గాక... విరిగిపోవాలి."

రాసింది తక్కువ కథలే అయినా, పాశ్చాత్య, భారతీయ సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన అధ్యయన శీలిగా కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి తన సాహిత్యాన్ని సాహితీ విమర్శకలోకం చర్చనీయాంశంగా ప్రవేశపెట్టగలగడం అభినందించదగ్గ విషయం. ఆయన కథలపై ప్రసంగాలే కాకుండా పరిశోధన పత్రాలు ఇంకా సమగ్రంగా వెలువడాల్సిన అవసరం ఉంది.

19-05-2013

✦ ✦ ✦